# శాస్తి

– కె. గోవిందరాజారావు

''సార్! మేనేజర్‌గారు మీ ఇద్దరినీ పిలుస్తున్నారు'' అంటూ ప్యూన్‌వచ్చి చెప్పడంతో ఉలిక్కిపడ్డారు రమణ, శ్రీను.

ఇద్దరూ భయపడుతూ మేనేజర్ రూమ్‌లోకి అడుగుపెట్టారు.

''రండోయ్...రండి... ఇద్దరూ అద్దె ఇళ్లకోసం తిరుగుతున్నారట కదా!'' అన్నాడు మేనేజర్.

ఆ విషయం ఈయనకు ఎలా తెలిసిందబ్బా? అనుకుంటూ ఆయన వంక చూసి ''అవున్సార్!'' అన్నారు.

''ఇక మీరు ఆ ఇబ్బంది పడక్కర్లేదు. మా ఇంట్లో ఒక పోర్షన్ ఖాళీగా వుంది. అందులో ఉండండి'' అంటూ అద్దెంతో కూడా చెప్పాడు.

ఇల్లు దొరికింది, అందులోనూ మేనేజర్ ఇంట్లో. ఆయన దగ్గర వుండడంవల్ల ఆయన్ని ఇంటి దగ్గర బాగా కాకా పట్టవచ్చు అనుకున్నారు ఇద్దరూ. తంతే గారెల బుట్టలో పడడం అంటే ఇదేనేమో అనుకుంటూ మేనేజర్ వద్ద సెలవు తీసుకుని తమ సీట్లలో కూలబడ్డారు.

శ్రీను, రమణ బ్రహ్మచారులు. వేరు వేరు ఊళ్ళ నుండి ట్రాన్స్‌ఫర్ అయి వచ్చి ఆ ఊళ్ళో పడ్డారు. ఇద్దరిదీ ఒకే పరిస్థితి కావడంవల్ల మంచి స్నేహం కుదిరింది. ఇద్దరూ నెలరోజుల నుండి అద్దె ఇళ్ల కోసం తిరుగుతున్నారు. అదీ పరిస్థితి.

ఇల్లు ఆఫీసుకు దూరమే. ఇద్దరికీ స్కూటర్లు వుండడంవల్ల ఫర్వాలేదు అనుకున్నారు.



అక్కడనుండి ప్రారంభమయ్యాయి వాళ్ళ కష్టాలు. తంతే పడింది గారెల బుట్టలో కాదనీ, మురికిగుంటలో అని వాళ్ళకి తెలిసి రావడానికి ఎన్నో రోజులు పట్టలేదు. ఉదయమే లేచి రెండు బ్రష్‌లు పట్టుకుని వచ్చి ''కాస్త టూత్ పేస్ట్ వెయ్యండోయ్'' అంటూ వచ్చేవాడు మేనేజర్,

ఆఫీసుకు వెళ్లేటప్పుడు ఒకరోజు రమణ స్కూటర్ ఎక్కితే వేరొక రోజు శ్రీను స్కూటర్ ఎక్కేవాడు. అంతటితో ఆగితే బాగుండేది. మున్సిపాలిటీ ఎద్దు చెత్తకుప్ప దగ్గర ఆగినట్లుగా హోటల్ కనబడితే స్కూటర్లు ఆపించి బాగా టిఫిన్ లాగించి బిల్లు ఎగ్గొట్టేవాడు. సాయంత్రం వచ్చేటప్పుడు దాహంగా వుందంటూ కూల్‌డ్రింక్‌లు తాగేవాడు. ఇద్దరూ మింగలేక, కక్కలేక పోతున్నారు. ఏమన్నా అందామంటే మేనేజర్ అయిపోయాడు. ఆయనకు ఎదురు చెబితే తమ పడి ఖాళీయే. ఎలా...ఎలా... తమలో తాము మదన పడసాగారు ఇద్దరూ.

ఆయన అలా వుంటే ఆయన భార్య ''ఏమోయ్ రమణా! హోటల్‌కి వెళ్లి టిఫిన్ తీసుకునిరా, ఏమోయ్ శ్రీను! బజారుకెళ్లి సరుకులు పట్రా'' అంటూ కొండవీటి చాంతాడంత లిస్ట్ ఇచ్చేది.

కరెంటు బిల్లు వస్తే వీళ్ళ చేతికిచ్చేది. వీటిలో ఏ ఒక్కదానికీ డబ్బులిచ్చేదికాదు.

తమ ఇద్దరి జీతం వీళ్ల ఇద్దరి జీవితాలకే సరిపోయేటట్లు వుంది. వీళ్ళని తప్పించుకోవడం ఎలా? కష్టపడి ఆఫీసు దగ్గరలో ఒక ఇల్లు చూసుకున్నారు.

ఓ రోజు అర్ధరాత్రి...

శ్రీను, రమణల గదిలో నుండి పెద్ద పెద్ద అరుపులు, కేకలు వినబడసాగాయి. ఉలిక్కిపడి నిద్ర లేచాడు మేనేజర్. గబగబా వాళ్ళ గది దగ్గరికి వెళ్లి తలుపు తట్టాడు.

''ఏంటోయ్! ఈ అరుపులు, కేకలు. మేము నిద్ర పోవక్కర్లేదా?'' అన్నాడు మేనేజర్ కోపంగా. వెంటనే రమణ అందుకుని–

''సార్! వీడికి నిద్దట్లో కలలొస్తాయి సార్. అదీగాక నిద్దట్లో నడిచే అలవాటు కూడా వుందిట సార్. ఆ టైమ్‌లో ఏం చేస్తాడో వాడికే తెలియదట. అందుకని నన్ను ఇందాకటినుండి గొడ్డుని బాదినట్లు బాదాడు. నా బాధ ఎవరికి చెప్పుకోను సార్'' అని కళ్లనీళ్ళు పెట్టుకున్నాడు.

''చూడు రమణ! కొందరికి ఆ జబ్బు వుంటుంది. మనమే వాళ్ళకి తగినంత దూరంగా వుండాలి'' అంటూ ఆవులిస్తూ వెళ్లిపోయాడు మేనేజర్.

కొన్నాళ్ళ తరువాత ఒక అర్ధరాత్రి ''టక...టక'' తలుపుమీద చప్పుడు అయ్యేసరికి ఉలిక్కిపడి వెళ్లి తలుపు తీసాడు మేనేజర్.

ఎదురుగుండా శ్రీను నుంచుని వున్నాడు.

''ఏమిటోయ్! ఇలా వచ్చావు? నిద్ర పట్టలేదా ఏమిటి?'' అంటూ ఇంకేదో అనబోయాడు మేనేజర్. అంతే! మేనేజర్ ముఖంమీద వెంట వెంటనే రెండు పిడిగుద్దులు పడ్డాయి. ఆ దెబ్బలకి క్రిందపడ్డాడు మేనేజర్. అంతే! గొడ్డుని బాధినట్లు బాదసాగాడు, 'కుయ్యో మొర్రో' అంటూ మేనేజర్ అరిచినా ప్రయోజనం లేకపోయింది. విరగకొట్టుడు కొట్టసాగాడు. ఇంతలో అరుపులకి రమణ పరుగెత్తుకొచ్చి శ్రీనును ప్రక్కకి తోసాడు. ఆ ఊపుకి వెళ్లి కొంత దూరం పడ్డాడు శ్రీను.

ఉలిక్కిపడి లేచి ''ఏమయింది సార్!'' అన్నాడు శ్రీను.

అప్పటికే మేనేజర్ మాట్లాడలేని స్థితిలో వున్నాడు. ''ఏమీలేదు నాయనా! వెళ్లి పడుకో'' అన్నాడు హీనస్వరంతో.

మర్నాడు... రమణ, శ్రీనులని పిలిచి...

''త్వరలో ఇల్లు ఖాళీ చేయండి. రాత్రి శ్రీను చేసిన రాద్ధాంతానికి నేను కాబట్టి సరిపోయింది. అదే నా భార్య తలుపు తీసుంటే...అమ్మో ఏం జరిగేదో? ఇల్లు ఖాళీ చేయండి'' అన్నాడు.

తమ పథకం పారినందుకు సంతోషిస్తూ ముందే చూసుకున్న ఆఫీసు దగ్గరలోని ఇంటికి మారిపోయారు శ్రీను, రమణ.

★